ముడుపు కడితే కోరిక తీరినట్లే..

స్వామి సన్నిధిలో ఉప్పునూతన పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులు

భద్రాచలం, ఫిబ్రవరి 11: పట్టణంలోని అహోబిలం నృసింహ స్వామివారి ఆలయం సమీపంలో ఉన్న కల్పవృక్ష నారసింహ స్వామి సన్నిధిలో ముడుపులు కడితే కోర్కెలు తీరతాయనే నమ్మకంతో ప్రతిరోజు వందల మంది భక్తులు భద్రాద్రికి వస్తున్నారు. ఆదివారం మాజీ మంత్రి, స్వర్గీయ ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ కృష్ణ చైతన్య ప్రత్యేక పూజలు చేయించారు.

రాష్ట్రస్థాయిలో టేకులపల్లి విద్యార్థుల ప్రతిభ

వేదికపై బహుమతులు స్వీకరిస్తున్న విద్యార్థులు

టేకులపల్లి, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్‌లో 4వ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను డీఈవో వెంకటేశ్వరచారి, హెచ్‌ఎం శ్రీనివాస్, గైడ్ టీచర్ మోహన్‌రావు అభినందించారు. ప్రతిభ చాటిన వారిలో పదో తరగతి దివ్యశ్రీ, తొమ్మిదవ తరగతి శ్రీహరిణిపవార్, ఎనిమిదవ తరగతి గీత టీములు ఉన్నారు.

బీఆర్ఎస్ పోరుగర్జన సభను విజయవంతం చేయాలి

టేకులపల్లి, ఫిబ్రవరి 11 : ఈ నెల 13న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించే పోరుగర్జన సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బోడ బాలునాయకు కోరారు.

సామూహిక కుంకుమ పూజలు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి11: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మణుగూరు వాసవీక్లబ్, వాసవీ వనితా వైభవం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. గుట్టమల్లారంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మాట్లాడారు.

నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి11: మణుగూరు ఆర్టీసీ డిపోనకు మంజూరైన రెండు కొత్త బస్సులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ బి.స్వామి, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

జూలూరుపాడు, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని శ్రీ రుక్మిణీసహిత సంతాన వేణుగోపాలస్వామి, అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్‌కి ఆలయ కమిటీ చైర్మన్ అల్లడి నర్సింహారావు కమిటీసభ్యులతో కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. గుట్టపైకి సిమెంటు రహదారి, ప్రసాదాల తయారీకి వంట గది, ఆఫీస్ రూం, కమ్యూనిటీహాల్, అభయాంజనేయస్వామి ఆలయ ముఖ మండపానికి నిధులు ఇవ్వాలని కోరారు.

ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టీయూ టీఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక శేషగిరిభవన్‌లో ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మంగీలాల్, ప్రధాన కార్యదర్శి చందర్, అసోసియేట్ అధ్యక్షురాలు జ్యోతిరాణి, ఉపాధ్యక్షుడు మోహన్, మండల అధ్యక్షుడు రమేశ్, జిల్లా కార్యదర్శి బోడా వెంకట్, రాజువలి పాల్గొన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన పీఆర్సీ కమిటీలో ఏజెన్సీ అలవెన్సు పెంచాలని, డిప్యూటేషన్లు రద్దు చేయాలని, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి పేరుతో టీచర్స్‌పై ఒత్తిడి తగ్గించాలని, పదో తరగతి టీచర్లకు సీఎల్‌కు వెసలుబాటు కల్పించాలని, సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలని కోరారు.

ప్రజాపాలన లబ్ధిదారుల గుర్తింపు

పాల్వంచ, ఫిబ్రవరి 11 : ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఆదివారం పాల్వంచ పట్టణంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు గృహజ్యోతి(కరెంట్ 200 యూనిట్లు లోపు వినియోగించే) వినియోగదారులకు ఫ్రీ కరెంట్ బిల్లుల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరిగి పరిశీలించారు.

గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ చూపిన అనూష

దమ్మపేట, ఫిబ్రవరి 11: ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో దమ్మపేట మండలంలోని గట్టుగూడెం చెందిన గిరిజన యువతి నల్లబోతుల అనూష ప్రతిభ చూపింది. అనూష ఎస్టీ మహిళ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు, ఎస్టీ జనరల్ విభాగంలో ఏడో ర్యాంకు, జనరల్ విభాగంలో 52వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 2,228 ర్యాంకు సాధించింది. అనూష ప్రాథమిక విద్య గట్టుగూడెం, యూపీఎస్, బీ గంగారం జడ్పీహెచ్ఎస్‌లో, సివిల్ ఇంజినీరింగ్ ట్రిపుల్ ఐటి నూజివీడులో పూర్తి చేసింది. అనూష తండ్రి నాగరాజు మొద్దులగూడెంలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అనూషను పలువురు అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME
I, GUDIPOODI SUNITHA (old name), W/o. GUDIPUDI JAGADEESH, R/o. H.No.11-8-159/2, Near Karthik Hospital, Lenin Nagar, Khammam Urban Mandal, Khammam District, Telangana -507001, Hereby changed my as GUDIPUDI SUNITHA (New name). Henceforth, I Shall be called as GUDIPUDI SUNITHA, W/o.GUDIPUDI JAGADEESH For all purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

క్వారీల్లో తనిఖీలు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని తోగ్గూడెంలో ఉన్న క్వారీలను ఆదివారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సందర్శించారు. ఆరు క్వారీలను సందర్శించి అక్రమంగా తవ్వకాలు, కంకర రవాణాను అరికట్టేందుకు ట్రెంచ్ ఏర్పాటు చేశారు.

కిన్నెరసానిని సందర్శన

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 11 : ప్రముఖ పర్యాటక కేంద్రమైన కిన్నెరసానిని రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి నార్వత్‌సింగ్ కుటుంబ సభ్యులతో ఆదివారం కిన్నెరసానిని సందర్శించారు. డీర్ పార్కు, పక్షుల మ్యూజియాన్ని సందర్శించారు. పర్యాటకరంగ అభివృద్ధికి చేస్తున్న వివరాలను రేంజర్ శ్రీనివాసరావు వారికి వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రెహమాన్,

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ

రామవరం, ఫిబ్రవరి 11 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఆదివారం రాజేందర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రామవరంలోని సాధన క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రవీణ్ మెమోరియల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు బానిసకాకుండా సక్రమమైన మార్గంలో వెళ్తూ తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని సూచించారు. ఏ పోటీల్లో అయినా గెలుపు, ఓటములు సహజమన్నారు. గెలిచిన వారు ఇంకా శ్రమిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. మొదట బ్యాటింగ్ చేసిన క్రీడాకారులను అభినందించారు. వన్‌టౌన్ సీఐ కరుణాకర్, టూటౌన్ సీఐ రమేష్‌కుమార్, బీఎస్పీ పార్లమెంటరీ జోనల్ ఇన్‌చార్జి కామేష్, సాధన గ్రౌండ్ నిర్వాహకులు మోరె భాస్కర్, మోరె రమేష్, పోటీల నిర్వాహకులు సాయి, శరత్, నున్న శివ, లింగేష్, బంటు నరేందర్, యెర్రా నాగేందర్, ధనుంజయ్, యెర్రా శ్రీనివాస్, విశ్వనాథ్, సిద్ధు, లక్కీ పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

రామయ్యకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 11: భద్రాచలం దివ్యక్షేత్రంలో ఆదివారం అర్చకులు అంతరాలయంలోని మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. ఉదయం అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం జరిపారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని జానకీపురం సత్యమ్మ తల్లి, బూర్గూడెంలోని ముత్యాలమ్మ తల్లి దేవాలయాల్లో అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ధూపదీప నైవేద్యాలు, మహానివేదన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయానికి వితరణ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని మామిళ్లవారిగూడెంలో వేంచేసిన శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు ఆర్థికసాయం అందించారు. మార్చి 8వ తేదీ నుంచి జరగనున్న 76వ వార్షిక జాతర సందర్భంగా ఆ గ్రామానికి చెందిన చిందిరాల నాగేంద్రరావు, శింగలదేవి కనకదుర్గరావు, శింగలదేవి సత్యభాను, మైలవరపు నాగేశ్వరరావు ఆలయ అభివృద్ధికి సహకరించారు. మిండా శ్రీనివాస్, శింగలదేవి చిన సత్యనారాయణ, చిందిరాల కిరణ్, వీర్నాల ఉమామహేశ్వరరావు, బ్రహ్మం ఉన్నారు.

రేపే నూతన కమిటీ ఎన్నిక..

మార్చి 8వ తేదీ నుంచి జరిగే జాతరకు ఏర్పాట్లు చేసేందుకు సోమవారం ఆలయ ఆవరణలో నూతన కమిటీ ఎన్నిక జరగనున్నదని నిర్వాహకులు తెలిపారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు జరిగిన ఆదాయ, వ్యయాలపై చర్చించి అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

మాఘమాసం పూజలు ప్రారంభం

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 11 : కొత్తగూడెం పట్టణంలోని శ్రీ విజయవిఘ్నేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మాఘమాసం పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో సులోచన, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠ

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని ఎదురుగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలు ముత్యాలమ్మ, మైసమ్మ, బొడ్రాయిలకు మూడ్రోజులుగా ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాములునాయక్, జుంకీలాల్, ఈశ్వర్‌సింగ్, చంటిబాబు, మాలోత్ విగ్నేష్ పాల్గొన్నారు.

నగర సంకీర్తన

పాల్వంచ, ఫిబ్రవరి 11 : పాల్వంచ పట్టణంలోని గొల్లగూడెంలో శ్రీ సద్గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసాయినాథ్ విగ్రహప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం శ్రీ సాయి సద్గురు ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గురూజీ వీరభద్రం పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పాల్వంచ రూరల్; ఫిబ్రవరి 11 : మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలకు అన్నప్రాసన, తలనీలాలు సమర్పించారు. జిల్లా జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కుమారి సాయిశ్రీ, పాల్వంచ తహసీల్దార్ నాగరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహీపతి రామలింగం పర్యవేక్షించారు.

శునకానికి నిలువెత్తు బంగారం

రామవరం, ఫిబ్రవరి 11 : తమ కుక్క అనారోగ్యానికి గురికావడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటే నిలువెత్తు బంగారం(బెల్లం) అమ్మకు సమర్పించుకుంటామని కోరుకున్నారు ఆ కుటుంబ సభ్యులు. ఆ శునకం ఆరోగ్యం బాగుకావడంతో ఆదివారం రుద్రంపూర్ పంచాయతీలో నివాసం ఉంటున్న కాసిన నగేష్, స్వప్న దంపతులు శునకం నిలువెత్తు బంగారం కొలిచి ఆ బంగారాన్ని బంధుమిత్రులకు పంచారు.

వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

పాల్వంచ : వాసవీమాత ఊరేగింపు నిర్వహిస్తున్న సేవాదళ్ సభ్యులు

భద్రాచలం, ఫిబ్రవరి 11: పట్టణంలోని వాసవీనగర్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున వాసవీ అమ్మవారి చిత్రపటంతో నగర సంకీర్తన జరిపారు. అనంతరం 6.30గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ, 7.30గంటలకు పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రాలను ధరింపజేసి, అలంకారం, అష్టోత్తర శతనామార్చన జరిపారు. ఆ తదుపరి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ సహిత గాయత్రీ హోమం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ, ఫిబ్రవరి 11 : ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవీ మాత ఆత్మార్పణం దినోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ అమ్మవారి సేవాదళ్ సభ్యులు ఊరేగింపు నిర్వహించారు. వేద పండితుడు చైతన్యశర్మ, చలువాది ప్రకాష్, పెండ్యాల రోజాలక్ష్మి, వాసవీక్లబ్ ఉప గర్నవర్ దారా నరసింహారావు, మహంకాళి సాయి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్ : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 11 : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అగ్నిగుండ ప్రవేశ పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలమంత్ర హోమం నిర్వహించారు. భక్తులు కలశములో సుంగద ద్రవ్యాలతో కలిపిన జలమును ఇంటి వద్ద నుంచి నెత్తిన ధరించి అమ్మవారి సన్నిధి చేరుకుని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

ఇల్లెందు, ఫిబ్రవరి 11: పట్టణంలో రూ.6.75కోట్ల విలువైన డీఎంఎఫ్‌టీ నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలి, కౌన్సిలర్లు, మున్సిపల్ ఏఈ శంకర్, నాయకులు దొడ్డ డానియేలు, సాంబమూర్తి, జానీ, లింగంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనుల పరిశీలన

పినపాక, ఫిబ్రవరి11: స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో జరుగుతున్న పనులను డీఎల్‌పీవో పవన్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని పాతరెడ్డిపాలెం, జగ్గారం, జానంపేట గ్రామపంచాయతీల్లో ఎంపీవో వెంకటేశ్వరరావుతో కలిసి పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్లు శుభ్రం చేయడం, రోడ్లపై గుంతలు పూడ్చడం, రహదారులు, అంతర్గత రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ప్రతీరోజు శుభ్రం చేయాలన్నారు. అనంతరం మరమ్మతులకు గురైన మిషన్‌భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించి, ప్రతిరోజు తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యంలో ఆర్ఎంపీలే కీలకం

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 11 : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించడంలో ఆర్ఎంపీలే కీలకమని, ప్రభుత్వ పరిమితులకు లోబడి ప్రాథమిక చికిత్స అందించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జూపల్లి రమేశ్ సూచించారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆర్ఎంపీ వైద్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సంఘ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగులకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు సిఫార్సు చేసి సామాజిక స్ఫూర్తి చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సత్యవరపు జగదీష్, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వై.సతీశ్, కార్యవర్గ సభ్యులు, పలువురు ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్‌లో..

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 11 : గ్రామీణ వైద్యుల సహాయ సంఘం సమావేశం మండలంలోని రొంపేడు ఏరియా మామిడి తోటలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్క గ్రామీణ వైద్యుడు పరిమితికి మించి వైద్యం చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి కాంతారావు, గౌరవ సభ్యులు రాజశేఖర్, టీ శ్రీనివాస్, పురుషోత్తం, నటరాజ్, అఖిల్, సతీశ్, రవి, డానియేల్, రవి, వీరేశ్ పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

పర్ణశాల, ఫిబ్రవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల క్రాస్‌రోడ్ వద్ద కారు ఆటో ఢీ కొన్న ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్ణశాల రామున్ని దర్శించుకున్న వస్తున్న భక్తులు కారులో వస్తుండగా భద్రాచలం నుంచి ప్రయాణీకులతో వెళ్తున్న చర్ల ఆటో పర్ణశాల క్రాస్‌రోడ్ వద్ద ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిరప పంట చోరీ

టేకులపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని తొమ్మిదోమైలు తండాలో శనివారం అర్ధరాత్రి కల్లంలో రాసిపోసిన మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తొమ్మిదోమైలు తండాకు చెందిన గుగులోత్ రామచందర్ రెండున్నర ఎకరాలలో మిర్చి సాగుచేశాడు. 15 రోజులు క్రితం మిర్చి పంట కోసి ఆరబెట్టాడు. మిర్చి ఆరిన అనంతరం రాసిగా పోశాడు. రాత్రి సమయంలో పదిక్వింటాళ్ల మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. సుమారు రెండు లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 11 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వారావుపేటకు చెందిన మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని దొంతికుంటకు చెందిన పచ్చినీల జ్యోతి(37) భర్త రాజాతో కలిసి ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామం బయలుదేరారు. జీలుగుమిల్లి మండలం గంపలగూడెం వద్ద బైక్‌పై వెనుక కూర్చున్న జ్యోతి అదుపు తప్పి క్రింద పడిపోయింది. వెంటనే 108 వాహనంలో అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. జీలుగుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 11: నిరంతరం ఇసుక లారీలు తిరుగుతుండడంతో దుమ్ముధూళితో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని మండలంలోని అనంతారం గ్రామస్తులు ఆదివారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. ప్రతీరోజు రాత్రింబవళ్లు తేడాలేకుండా లారీలు గ్రామంలో తిరుగుతుండంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దుమ్ముధూళి ఇండ్లలోకి రాకుండా రహదారులపై నీళ్లు స్ప్రే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో గ్రామం మీదుగా ఇసుక లారీలను వెళ్లకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

పేకాటస్థావరంపై దాడి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని తుమ్మలగూడెం శివారులో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.5,500 నగదు, 8 పందెంకోళ్లు, 4 పందెంకత్తులు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని హర్యాతండా పంచాయతీ దుబ్బతండా గ్రామంలో బానోత్ దస్లీ(48) అనే మహిళ విద్యుత్‌షాక్‌తో ఆదివారం మృతిచెందింది. రోజులాగే వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వచ్చి తాళం తీస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి షాక్ కొట్టింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తాం..

భద్రాచలం, ఫిబ్రవరి 11: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ప్రారంభించినందున, ఉపాధ్యాయుల ఇంగ్లీష్ బోధన మరింత మెరుగు పరిచేందుకే శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదివారం తెలిపారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ పాఠశాలలో ఉపాధ్యాయుల ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విదాయ బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో భద్రాచలం, ఖమ్మం ఏసీఎంవోలు రమణయ్య, నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

భద్రాచలం, ఫిబ్రవరి 11: పట్టణంలోని పాత ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే శరత్ మ్యాక్సీ విజన్ వరంగల్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంఘ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరానికి వచ్చేటపుడు విశ్రాంత ఉద్యోగులు ఉచిత ఈహెచ్ఎస్ సౌకర్యం కలిగిన వారు తప్పకుండా తమ వెంట హెల్త్ కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్లు చేయించుకోవచ్చన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 11 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని జానకీపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16న చేపట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.త

ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అధ్యక్షుడిగా అప్రోజ్‌పాషా

టేకులపల్లి, ఫిబ్రవరి 11 : ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఇల్లెందు నియోజకవర్గ అధ్యక్షునిగా మండలానికి చెందిన మహ్మద్ అప్రోజ్‌పాషా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రుగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఇల్లెందు నియోజకవర్గ అధ్యక్షునిగా తనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

అశ్వాపురం, ఫిబ్రవరి 11: స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులకు వార్డెన్ నర్సింహారావు సొంత ఖర్చులతో ఆదివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

సీఈఐఆర్ పోర్టల్ టెక్నాలజీని వినియోగించుకోవాలి

గుండాల, ఫిబ్రవరి 11: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ టెక్నాలజీ ఉపయోగించి తెలుసుకోవచ్చని ఎస్సై కిన్నెర రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఒక బాధితుడికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను స్టేషన్‌లో అందించారు. గుండాల సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పది ఫోన్లు బాధితులకు అప్పగించామని తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

కరకగూడెం, ఫిబ్రవరి 11: అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాజారామ్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఇటీవల అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసామని తెలిపారు. పెద్దవాగుతో పాటు మండలంలోని సమీప వాగుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా ట్రాక్టర్ యజమానులు అక్రమంగా ఇసుకను తరలిస్తే ప్రజలు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

పినపాక, ఫిబ్రవరి11: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిరోషా రెడ్డి అన్నారు. ఆదివారం ఏడూళ్లబయ్యారంలోని శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాల విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, రాధిక, జయసింహారెడ్డి, సంపత్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎంపీడీవో బదిలీ

సారపాక, ఫిబ్రవరి 11: బూర్గంపహాడ్ మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో బదిలీ అయ్యారు. బూర్గంపహాడ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న తిరుమలాచారిని కొత్తగూడెం డీఏవోగా, ఎంపీడీవోగా పనిచేస్తున్న వివేక్‌రామ్ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు.

14న విగ్రహ ప్రతిష్ఠ

చుంచుపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని పెనుబల్లి పంచాయతీలో ఈ నెల 14వ తేదీన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త వేల్పుల మల్లేశ్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని, అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 11 : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లా అధికారులు సమయానికి హాజరుకావాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యలపై ఫిర్యాదులు లిఖిత పూర్వకంగా అందజేయాలని కలెక్టర్ సూచించారు.

పూత కోసం మామిడి రైతుల పాట్లు

చంద్రుగొండ, ఫిబ్రవరి 11: ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా రావడంతో వచ్చిన పూతను రక్షించుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని దామరచర్ల, సీతాయిగూడెం, మద్దుకూరు, చంద్రుగొండ, పోకలగూడెం, తుంగారం గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో మామిడిని రైతులు సాగు చేస్తున్నారు. పూతకు నల్లి, పూత రాలుడు వంటి తెగుళ్లు సోకడంతో పూతను కాపాడుకోవడం కోసం మందులను పిచికారీ చేస్తున్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

దమ్మపేట, ఫిబ్రవరి 11: వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పురవీధుల్లో గ్రామోత్సవంతో కార్యక్రమం ముగిసింది.

రహదారికి ఇరువైపులా ఆక్రమణల తొలగింపు

ములకలపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని పాల్వంచ-దమ్మపేట రహదారికి ఇరువైపులా వ్యాపారస్తులు ఆక్రమించారు. ఈ ప్రాంతవాసులకు ఇబ్బందికరంగా మారడంతో ఎస్సై రాజమౌళి ప్రత్యేక దృష్టి సారించారు. నాయకులు, వ్యాపారస్తులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. ఆదివారం ఎస్సై రాజమౌళి ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపులా సుమారు ఎనిమిది అడుగుల మేర ఆక్రమణలు తొలగించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ లకన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు అడపా నాగేశ్వరరావు, ఇనుగంగి రాము, క్రాంతి, జబ్బార్ పాల్గొన్నారు.